ఎదురు లేని వెదురు రవాణా

- మామూళ్ల మత్తులో అధికారులు
- కంచె చేను మేస్తున్న చందంగా..
- మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు కర్రల సరఫరా..?
- సైకిళ్లు, గుర్రాలపై తరలింపు



మొబైల్ పార్టీ అధికారుల దాడిలో పట్టుబడిన సైకిళ్లు, వెదుర్లు

రుద్రవరం, ఫిబ్రవరి 3 : నల్లమల వెదురు పొదల అరణ్యం. ఆకాశాన్నంటే ఎత్తులో గుబురు వెదురు పొదలే నల్లమలకు సౌందర్యం. ఎండాకాలం మోడుబారినా తొలకరి వచ్చిందంటే రోజుల్లో అడవంతా వెదురు అందాలను సంతరించుకుంటుంది. అట్లాంటి వెదురు అక్రమంగా తరలిపోతోంది. అడవి లోపలికి వాహనాలు, సైకిళ్లు, గుర్రాలను తీసికెళ్లి వెదుర్లు, కలపను చెలిమ ఫారెస్టు రేంజ్ నుంచి అక్రమంగా తరలించుకొని పోతున్నారు.

నల్లమల దట్టమైన వెదురు వనాల అడవి. చెలిమ ఫారెస్టు రేంజ్ 23,740.53 హెక్టార్లలో విస్తరించి ఉంది. ఇక్కడ విలువైన కలప, వెదురు పొదలు విస్తారంగా ఉన్నాయి. దీంతో అక్రమార్కులు నల్లమలను కొల్లగొడుతున్నారు. ముఖ్యంగా చెలిమ రేంజ్‌లో వెదుర్లు, కలప అక్రమ రవాణాకు ఎదురే లేదు. కొందరు అధికారులు స్మగర్లతో చేతులు కలిపి అక్రమ రవాణాకు ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వాహనాలను అడవిలోకి తీసికెళ్లి వెదుర్లను, కలపను తరలించుకొని పోతున్నారు. సైకిళ్లు, గుర్రాలపై పెద్ద ఎత్తున అక్రమ రవాణా జరుగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి.

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

అడవుల సంరక్షణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటేనే కింది స్థాయి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటారు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో అడవి గుల్లయిపోతున్నదనే విమర్శలు ఉన్నాయి.

మామూళ్ల మత్తులో అధికారులు..?

అటవీ సంరక్షణను గాలికొదిలేసిన కొందరు ఫారెస్టు అధికారులు మామూళ్లకు అలవాటు పడ్డారు. దీంతో అటవీ సంపదను స్మగ్లర్లు కొల్లగొడుతున్నారు. అడవిలో వెదుర్లను, కలపను నరికించి వాహనాలు వచ్చే ప్రాంతానికి సైకిళ్లపై తరలించి, అక్కడ నిల్వ చేసి వాహనాల్లో లోడ్ చేసి రాత్రిళ్లు బైటికి తరలించి హైవే మీది నుంచి వేగంగా తరలించుకొనిపోతున్నారు.

అక్రమ రవాణా తతంగం ఇలా



అధికారుల దాడిలో పట్టుబడిన వెదురు కర్రలు

కొందరు స్మగ్లర్లు వెదురు కర్రలు నరికించి అటవీ ప్రాంతంలో నిల్వ చేశారు. ఆ సమాచారం రుద్రవరం ఫారెస్టు అధికారులకు అందింది. రుద్రవరం ఫారెస్టు అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో నిల్వ ఉన్న కర్రల్లో 1500 మాత్రమే డిపోకు తరలించారు. మిగిలిన సుమారు 4500 కర్రలు ఏమయ్యాయనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు ఆ రేంజ్ అధికారులు ఈ ఒక్కసారికి వదిలేమని కోరడంతో కేవలం 1500 వెదురు కర్రలు స్వాధీనం చేసుకున్నట్లు రికార్డుల్లో చూపించారు. ఒక వాహనాన్ని కూడా వదిలేసినట్లు సమాచారం. పక్క రేంజ్ అధికారులు, మొబైల్ పార్టీ అధికారులు దాడులు జరిపి వెదురు కర్రలు, వెదుర్ల సైకిళ్ల పట్టుకుంటుంటే ఇంతకూ స్థానిక అధికారులు ఉన్నట్లా, లేనట్లా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

వాహనాల్లో వెదురు కర్రలు కింద కలప దుంగల రవాణాకు కూడాపాల్పడుతున్నారు.



అడపాదడపా..

ఇటీవల నంద్యాల జిల్లా మొబైల్ ఫారెస్టు అధికారులు పెద్దకంబలూరు సెక్షన్‌లో దాడి చేసి తొమ్మిది వెదుర్ల సైకిళ్లను స్వాధీనం చేసుకుని పెద్దకంబలూరులో ఉంచారు. అలాగే రుద్రవరం ఫారెస్టు అధికారులు దాడి చేసి 1500 వెదురు కర్రలు స్వాధీనం చేసుకుని రుద్రవరం కలప డిపోకు తరలించారు.

కర్నూలు నుంచి మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు సరఫరా..?

నల్లమల నుంచి వాహనాల్లో వెదురు కర్రలను ఒక వైపు ప్రొద్దుటూరుకు, ఇంకో వైపు కర్నూలుకు తరలిస్తున్నారు. కర్నూలుకు తరలించిన కర్రలను ఓ గోదాములో నిల్వ చేసి గోనెపట్టలతో ప్యాకింగ్ చేసి మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు ట్రైన్‌లో రవాణా చేస్తున్నట్లు సమాచారం.



నల్లమల అటవీ తీరంలో సైకిల్‌పై వెదుర్లు తీసుకెళుతున్న దృశ్యం

కంచె చేను మేస్తున్నట్లు..

అటవీ సంరక్షణ బాధ్యత ఉన్న అధికారులు అడవిని స్మగ్లర్లకు అప్పగించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అక్రమ రవాణా జోరందుకుంది. ఇలాగైతే అటవీ సంపద భవిష్యత్ తరాలకు కరువవుతుంది. అడవిని సంరక్షించాల్సిన అధికారులే ఇలా గాలికొదిలేస్తే సంరక్షణ సాధ్యమా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమ రవాణా జరగకుండా నిఘా పెట్టాం



చెలిమ రేంజ్ పరిధిలో వెదురు అక్రమ రవాణా జరగకుండా నిఘా పెట్టాం. సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి అక్రమ రవాణాను అడ్డుకుని అటవీ సంపదను కాపాడుతాం.

- ఈశ్వరయ్య, ఫారెస్టు రేంజర్, చెలిమ రేంజ్

బహిరంగ విచారణకు సిద్ధం

- కాటసాని సవాల్‌ను స్వీకరించిన గౌరు దంపతులు
- దూపాడులో 12 ఎకరాల భూమిని కాజేసింది వాస్తవం కాదా?
- ఎన్ఆర్ఐకు చెందిన భూమిలో నీ బినామీలు బోర్డు పాత లేదా
- మరోసారి ప్రశ్నలు సంధించిన టీడీపీ నేతలు



మాట్లాడుతున్న గౌరు చరిత

కల్లూరు, ఫిబ్రవరి 3: నాలుగు రోజుల క్రితం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విసిరిన సవాల్‌కు గౌరు దంపతులు ప్రతి సవాల్ విసిరారు. శనివారం నగరంలోని గౌరు దంపతులు వారి స్వగృహంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతే కాటసాని అక్రమాలపై బహిరంగ విచారణకు తాము సిద్ధమని అన్నారు. దూపాడు సర్వే నెంబరు 139లోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన 12 ఎకరాల విలువైన భూమి కాజేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. లక్ష్మీపురం సర్వే నెంబరు 789లోని జాతీయ రహదారికి పక్కనే ఉన్న వెంచర్‌లోని పేదలకు చెందిన 162 ప్లాట్లు దాదాపు 5.80 ఎకరాల భూమిని కాటసాని బినామీలు అన్యాక్రాంతం చేయలేదా అని నిలదీశారు. తహసీల్దారు ఆ భూమి పేదలకు చెందినదని క్లియర్ రికార్డు ఇస్తే వారిని ఇబ్బందులకు గురి చేయలేదా అని అన్నారు. కల్లూరు సర్వే నెంబరు 603లోని ప్లాట్ నెంబరు 87లో ఎన్ఆర్ఐకి చెందిన భూమిలో పాణ్యం ఎమ్మెల్యే బినామీలు బోర్డులు పాతిన మాట వాస్తవం కాదా అంటూ సూటిగా ప్రశ్నించారు. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, కల్లూరు, గడివేముల అర్బన్‌లలో ఎమ్మెల్యేపై దాదాపు 120కి పైగా అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఆరోపించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని సవాల్‌ను స్వీకరించామని కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో బహిరంగ విచారణకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నివిధాలా అభివృద్ధి చేశారన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణం 80శాతం టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. అనంతరం నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేకు నియోజకవర్గం అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని, భూకబ్జాలు, ఎర్రమట్టి తరలించి సొమ్ము చేసుకోవడం మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు. రామక్రిష్ణారెడ్డి అనే వైసీపీ నాయకుడికి గుట్టపాడు పొలిమేరలో 57 ఎకరాలకు ఆర్ఎస్ఆర్ చూపిస్తున్నారని వీళ్లంతా ఎవరని మల్లెల ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి రాగానే కాటసాని చేసిన తప్పులను సరి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో కల్లూరు అర్బన్ వార్డుల అధ్యక్షుడు, కర్నూలు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డి, గోవిందరెడ్డి, వాకిటి మాదేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో తామ్ర శాసనాలు లభ్యం



విజయనగర రాజుల కాలానివిగా గుర్తింపు

నంద్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో ఘంటా మఠం జీర్ణోద్ధరణ పనులు సందర్భంగా విజయనగరం రాజుల కాలం నాటి తామ్ర శాసనాలు ఇటీవల లభ్యమయ్యాయి. ఈ శాసనాలు విజయనగర రాజు సంగమ వంశానికి చెందిన మూడో విరూపాక్షుడి కాలానికి చెందిన శక సంవత్సరం 1395లో విజయ సంవత్సరం చైత్ర మాసం శుక్ల పక్షం 13వ తిథిన అంటే ప్రస్తుతం అనుసరిస్తున్న కేలండర్ ప్రకారం 1473వ సంవత్సరం మార్చి 12 శుక్రవారం నాడు రాయించినట్లు తెలుస్తోంది. ఈ శాసనాలు సంస్కృత, కన్నడ, నాగరి లిపిలో ఉన్నాయి. వీటి ప్రకారం మూడో విరూపాక్షుడు శ్రీశైల మల్లికార్జున స్వామి రథోత్సవాలను నిర్వహించేందుకు అప్పటి కోపాణ సీమ యాదపురంలోని మంగళపురం, యలబర్గసీమలోని తిప్పరసోపల్లి, వేదవతి గ్రామాలను దానంగా రాయించి, అప్పటి భిక్షవృత్తి మఠాధిపతి సిద్ధయ్యదేవుడికి అందించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఆత్రేయ గోత్ర, యజు శాఖకు చెందిన వల్లభ, దుర్గయ, విరాణ బ్రాహ్మణులకు 20 వరహాలను బహుమతిగా ఇచ్చినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

ఇది దగా డీఎస్సీ

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, ఫిబ్రవరి 3: నిరుద్యోగులను మరోసారి వంచిస్తూ ఇటీవల ప్రకటించిన డీఎస్సీ మెగా డీఎస్సీ కాదని, అది దగా డీఎస్సీ అని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శనివారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి విలేఖర్లతో మాట్లాడుతూ డీఎస్సీ కింద 50,892 ఖాళీలు ఉంటే కేవలం 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను మోసం చేయడమే అన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జగన్ రెండు నెలల ముందు డీఎస్సీ డ్రామాకు తెరలేపారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీలో 50892 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను గుర్తించగా జగన్ ప్రభుత్వం 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకుందని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేని జగన్ పాలనలో ఇప్పటికి 1745 మంది నిరుద్యోగులు బలవన్మణాలకు పాల్పడ్డారన్నారు. టీడీపీ హయాంలో పెట్టుబడులు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంటే నేడు గంజాయి రవాణాలో ప్రథమ స్థానంతో ఉందని బీసీ ఎద్దేవా చేశారు.

గవర్నర్‌ను కలిసిన ఆర్‌యూ వీసీ


కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 3: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ జనీర్ ఆహ్మద్‌ను రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి సుధీర్ ప్రేమ్ కుమార్ కలిశారు. శనివారం అమరావతిలోని గవర్నర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఉపకులపతిగా అవకాశం కల్పించి నందుకు ధన్యవాదాలు తెలిపారు. నూతన ఉపకులపతిగా బాధ్యతలు తీసుకున్న ఆయన వర్సిటీ అభివృద్ధికి మార్గ దర్శకం చేయాల్సిందిగా గవర్నర్‌ను కోరారు.



గవర్నర్‌ను కలిసి ఆర్‌యూ వీసీ

అనుమతి గోరంత.. తవ్వేది కొండంత

అధికార పార్టీ అండతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అది ఇదీ అని లేకుండా ఎక్కడ ఆదాయం ఉంటే అక్కడ వాలిపోయి దందాలకు దిగుతున్నారు. వేసవి కాలం సమీపిస్తుండటంతో అక్రమార్కుల కన్ను మట్టి తవ్వకాల మీద పడింది. చెరువులను, అనువుగా ఉన్న చేలను చూసుకుని.. నామమాత్రపు అనుమతులు తీసుకుని అందినకాడికి తవ్వుకుంటున్నారు. రోజుకు వందకు పైగా లోడ్లను రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వదిలేస్తోందనే విమర్శలు ఉన్నాయి. దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతోంది.



- మట్టి దొంగల ఆగడాలు
- రోజుకు వందకు పైగా ట్రిప్పులు
- అధికారపార్టీ అండతో చెలరేగిపోతున్న అక్రమార్కులు

నంద్యాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):

● ఇలా తరలిస్తున్నారు..

అభివృద్ధి కార్యక్రమాల పేరిట సంబంధిత విభాగాలు నిత్యం ఏదో ఒక చోట నిర్మాణాలు చేపడుతూ ఉంటాయి. వీటికి మట్టి అవసరం అవుతుంది. దీనికి తోడు రియల్ ఎస్టేట్ వెంచర్లకు కూడా మట్టి అవసరమవుతుంది. వీటికి సరిపడేంత మట్టిని తరలించాలంటే భారీ ఎత్తున అనుమతులు కావాలి. దీనికి రాయల్టీ కూడా పెద్ద మొత్తంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చేస్తే అక్రమార్కులకు మిగిలేది ఏమీ ఉండదు. దీంతో రోజుకు 10 నుంచి 12 ట్రిప్పుల మేర తవ్వేందుకు అనుమతులు తీసుకుని.. ఆ మేరకు మట్టిని మధ్యాహ్నం పూట తరలిస్తారు. ఇక వీరి దందా చీకటి పడగానే మొదలై తెల్లవారుజాము 4 గంటల వరకు సాగుతూనే ఉంటుంది. ఇదేమిటని ఎవరైనా అడిగితే తమకు అనుమతులు ఉన్నాయని పత్రాలు చూపుతారు. అన్ని సక్రమంగా ఉన్నపుడు రాత్రి పూట ఎందుకు తరలించడం అని ఎవరికీ అనుమానం రాకూడదు. వస్తే వారిని ఇబ్బందిపెడతారు. అసలు ఎన్ని క్యూబిక్ మీటర్లకు అనుమతులు ఉన్నాయి? ఎంత మేర తవ్వారు? అని రాత్రిపూట చూసే వీలు ఉండదు కాబట్టి వారు చెప్పిందే నమ్మి ఆ సమయంలో చెకింగ్ చేసే అధికారులు మిన్నకుండిపోతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు..

అసలే గ్రామాల రోడ్లు అంతంత మాత్రంగా ఉన్నాయి. వీటిపైన పదుల సంఖ్యలో మట్టి వాహనాలు రోజుకు లెక్కకు మించి తిరుగుతున్నందు రోడ్లు దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా అక్రమార్కులు మహానంది మండలం గాజులపల్లె, రుద్రవరం మండలంలోని రుద్రవరం, కోటకొండ, గంగవరం, ఆళ్లగడ్డ మండలంలోని బోయిలకుంట్ల ప్రాంతాల్లో ఎక్కువగా ఈ మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ గ్రామాల నుంచి రేయింబవళ్లు లారీలు, ట్రాక్టర్లు తిరుగుతుండటంతో ఏ సమయంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మట్టిని తరలిస్తున్న ఓ లారీ గాజులపల్లె సమీపంలో బోల్తా పడింది. ఆ సమయంలో ఆ దారి వెంట ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇక గ్రామాల్లోని ప్రజలు ఎవరైనా అడిగే ప్రయత్నం చేస్తే తాము అధికార పార్టీకి చెందిన వారమని దబాయించి నోరు మూయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఇప్పటికైనా అధికారులు అక్రమ మట్టి తవ్వకాలను అరికడితే బాగుంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

అంతా వారే..

జిల్లాలో ఏ దందా చూసినా దాని వెనుక అధికార పార్టీ నాయకుల అండదండలు ఉంటున్నాయి. మట్టి తవ్వకాల వెనుక కూడా వీరి పాత్రే ఉన్నదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా మహానంది మండలం గాజులపల్లె, నంద్యాలలోని పొన్నాపురం, అయ్యలూరు, రుద్రవరం మండలంలోని కోటకొండ, ఆళ్లగడ్డ మండల కేంద్రంలోని అధికార పార్టీ ప్రజా ప్రతినిధి ముఖ్య అనుచరులు దగ్గరుండి మరీ ఈ మట్టి అక్రమ తవ్వకాలను చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇలా తవ్విన మట్టిని అయ్యలూరి చుట్టుపక్కల ఇటుక బట్టీలకు, ఆయా ప్రాంతాల్లో వేసే వెంచర్లకు తరలించి ఒక్కో టిప్పరు మట్టికి రూ.10 వేలు, ట్రాక్టరు మట్టిని రూ.4 నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా రోజుకు ఆయా గ్రామాల నుంచి దాదాపు 100 ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన అక్రమమార్కులు రోజుకు లక్షల రూపాయలు కూడబెట్టుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. అక్రమార్కులంతా అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారని, పైగా ఎవరికి ముట్టజెప్పాల్సినవి వారికి ముట్టజెబుతుండటంతో వారి ఆటలు సాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది మహానంది మండలంలోని ఓ చెరువులో పదుల సంఖ్యలో వాహనాలు అక్రమంగా మట్టిని తరలిస్తున్నాయని అధికారులకు చెప్పినా.. తాము సమావేశంలో ఉన్నామని ఇప్పుడు రాలేమని అన్నారు. దీన్నిబట్టి అక్రమార్కులు, అధికారుల మధ్య సంబంధం ఏమిటో ఇట్టే తెలిసిపోతోంది.

నామ్‌కే వాస్తే దాడులు..

మట్టి అక్రమ తవ్వకాల గురించి పత్రికల్లో వచ్చినా.. లేదా ఎవరైనా ఫిర్యాదు చేసినా అధికారులు అప్పటికప్పుడు హడావుడి చేస్తారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే తవ్వకాలను నిలిపివేయించామనో లేక వాహనాలను పట్టుకున్నామనో చెబుతారు. అనుమతుల కంటే ఎక్కువ మొత్తంలో మట్టి తవ్వితే పర్యావరణానికి ఇబ్బంది అన్న కోణంలో భారీ మొత్తంలో జరిమానా విధిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అయితే ఇలాంటివి ఏమీ జరగకపోవడంతో అక్రమ మట్టి తరలింపు ఇష్టారాజ్యంగా జరుగుతోంది. గతంలో అక్రమ మట్టి తవ్వకాలు చేసే వ్యక్తిని అధికారులు పట్టుకున్న రెండ్రోజులకే మళ్లీ అతను మట్టి తవ్వకం చేపట్టాడు. దీనిని బట్టి వాళ్లకు చట్టాలన్నా, అధికారులన్నా ఎంత చులకన చూపు ఉందో అర్థమవుతోంది.





క్యాన్సర్ పట్ల ఆందోళన వద్దు

- అందుబాటులో అధునాతన వైద్యం
- నోటి క్యాన్సర్, బ్రెస్ట్ కేన్సర్ కేసులే అధికం
- ఉమ్మడి జిల్లాలో 20 వేల మంది బాధితులు
- నేడు వరల్డ్ క్యాన్సర్ డే

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 3: ప్రపంచ మానవాళిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో క్యాన్సర్ ఒకటి. అయితే రోగులు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, అధునాతన వైద్యం అందుబాటులో ఉందని వైద్యులు చెబుతున్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకం వల్లే ఎక్కువ మంది ఈ రోగం బారిన పడుతున్నారు. నోటి క్యాన్సర్, బ్రెస్ట్ కేన్సర్ కేసులే అధికంగా నమోదు అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 20 వేల మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా జనాలను బలి తీసుకుంటున్న వ్యాధుల్లో క్యాన్సర్ మహమ్మారిది రెండో స్థానం. డబ్ల్యూహెచ్‌వో నివేదిక ప్రకారం భారతదేశంలో రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ కేసులు 32 శాతం ఉన్నాయి. భారతదేశంలో 14.12 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదు కాగా ఇందులో 9.16 లక్షల మరణాలు సంభవించాయి. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు తొమ్మిది మంది పురుషుల్లో ఒకరు, 12 మంది మహిళల్లో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రతి ఏటా 4వ తేదీన వరల్డ్ క్యాన్సర్ డేను జరుపుకుంటారు. క్యాన్సర్ నివారణ చికిత్సను ప్రోత్సహించేందుకు క్యాన్సర్ డేను నిర్వహిస్తుంటారు. 1993 జేనివాలో యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (యుఐసీసీ) స్థాపించారు.

ఈ ఏడాది థీమ్: ప్రతి యేటా ఒక థీమ్‌ను తీసుకుని వరల్డ్ క్యాన్సర్ కంట్రోల్ యూనియన్ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ ఏడాది క్యాన్సర్ కేర్ గ్యాప్‌ను తగ్గించండి. రోజురోజుకు మనిషి జీవనశైలిలో అనేక మార్పులు వస్తున్నాయి. ఆ మార్పులకు తగ్గట్టు కొత్త కొత్త రోగాలు కూడా వస్తున్నాయి. అయితే మనిషి ప్రాణాంతకరమైన రోగాల బారిన పడి భయంతోనైతే రోజులు దగ్గర పడ్డట్టే. క్యాన్సర్ విషయంలో దాదాపు ఇదే జరుగుతోంది. చక్కటి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ మెరుగైన జీవనశైలిని అలవర్చుకోవడంతోపాటు వైద్య చికిత్స తీసుకుంటే క్యాన్సర్‌ను ఎదుర్కోవచ్చని వైద్యులు అంటున్నారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2019 జనవరి 23న రూ.120 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే భవన నిర్మాణ పనులు పూర్తికాగా వైద్యపరికరాలు రావాల్సి ఉంది. మెడికల్, సర్జికల్, రేడియేషన్ న్యూక్లియర్, మెడిసిన్ క్యాన్సర్ చికిత్సలు ప్రజలకు అందనున్నాయి. 120 పడకలతో ఏర్పాటు కానున్న స్టేట్‌క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌తో రాయలసీమ జిల్లాల ప్రజలకే కాకుండా గద్వాల, బళ్లారి, రాయచూరు జిల్లాల రోగులకు ఎంతో మేలు జరగనుంది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

మద్యపానం, ధూమపానం, పొగాకు నమలడం వంటి అలవాట్ల కారణంగా కొందరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. మరికొందరు అవగాహన లోపం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వ్యాధికి గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 20వేల మందికి పైగా క్యాన్సర్ రోగులు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరంతా వ్యాధి రెండో దశకు చేరుకున్నవారే. మరెంతో మంది వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోకపోవడంతో వెలుగులోకి రాలేదు. వ్యాధిగ్రస్థుల్లో ఎక్కువ శాతం మంది గుట్కా, ఖైనీ, జిందా, సిగరేట్ వంటి మత్తు పదార్థాలను నమిలేవారే ఉన్నారు. పొగతాగే అలవాటు ఉన్న వారు నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఇక మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడే వారు అధికంగా ఉన్నారు. వైరల్ ఇన్‌ఫెక్షన్ సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్ల గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు.





కర్నూలు నగరంలో నిర్మాణంలో ఉన్న క్యాన్సర్ ఆసుపత్రి

120 పడకలతో క్యాన్సర్ హాస్పిటల్



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని పది ఎకరాల్లో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ 120 పడకలతో ఏర్పాటు కానుంది. మెడికల్ అంకాలజి, సర్జికల్ అంకాలజి, రేడియేషన్ అంకాలజి, న్యూక్లియర్ మెడిసిన్, పాలిటివ్ కేర్‌తో పాటు బయోకెమిస్ట్రీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడీయాట్రిక్ అంకాలజి, డిపార్టుమెంట్లు వస్తాయి. ఐదు ఆపరేషన్ థియేటర్లతోపాటు అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయి. టాటా ట్రస్టు సాంకేతిక సహకారంతో కర్నూలులో కె.ఆకారంలో నిర్మించే ఈ హాస్పిటల్ వల్ల ఎంతో మంది పేద క్యాన్సర్ రోగులకు అత్యుత్తమ స్థాయిలో లేటెస్టుగా సేవలు అందుతాయి.

- డాక్టర్ కృష్ణప్రకాష్, హెచ్‌వోడీ, క్యాన్సర్ విభాగం, కర్నూలు ప్రభుత్వాసుపత్రి

ప్రాథమిక దశలోనే గుర్తించాలి



క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్ అని ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎన్నో వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్ విషయంలో మహిళలు, యువత తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జీవన శైలి మార్పులు సరైన వైద్య పరీక్షలు, ముందస్తుగా గుర్తించడం తగిన చికిత్స ద్వారా ఈ వ్యాధిని నివరించవచ్చు.

- డాక్టర్ బి.రవీంద్రబాబు, క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణుడు, ఒమేగా హాస్పిటల్, కర్నూలు

ఆడపిల్లలకు టీకా తప్పనిసరి



9 నుంచి 14 సంవత్సరాలలోపు బాలికలకు తప్పనిసరిగా గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా హెచ్‌పీవీ టీకాలు వేయించుకోవాలి. ఇటీవల కేంద్రం కూడా బడ్జెట్‌లో బాలికలకు మిషన్ ఇంద్రధనస్సు ద్వారా టీకాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో సర్వేకల్ క్యాన్సర్ తగ్గుముఖం పడుతుంది. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ఆదివారం ప్రకాష్‌నగర్‌లోని వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారు.

- డాక్టర్ సి.వాసురెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు, వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, కర్నూలు

నాపరాయి తవ్వకాలపై విజిలెన్సు దాడులు

వ్యక్తిపై కేసు నమోదు.. వాహనాల సీజ్



నాపరాళ్ల తవ్వకాలపై దాడులు నిర్వహిస్తున్న గనుల శాఖ అధికారులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 3: పలుకూరు గ్రామ పొలిమేరలోని సర్వే నెంబర్ 719లో అక్రమంగా నాపరాళ్ల తవ్వకాలు చేస్తున్నట్లు గుర్తించామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం గనుల శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ విభాగం తనిఖీలు నిర్వహించింది. బనగానపల్లె మండలం పలుకూరు పొలిమేరల్లో 3,400 క్యూబిక్ మీటర్ల మేర నాపరాయిని తవ్వి అక్రమంగా తరలించినట్లు గుర్తించారు. ఈ తవ్వకాలకు సంబంధించి గడ్డం మధు సూదన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. కేసు విచారణ చేసి దోపిడీకి గురైన సొమ్మును రికవరీ చేస్తామని చెప్పారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏడీ భైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, మురహరి పాల్గొన్నారు.

రేపు స్పందన

కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ జి. సృజన శనివారం ఒక ప్రకటనలో తెలపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 3: లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. శనివారం కోవెలకుంట్ల, సౌదరదిన్నె గ్రామాల మధ్య ఉన్న రహదారిలో ఈ ఘటన జరిగింది. రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన పెద్దరాముడు కుమారుడు కృష్ణయ్య (34) కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన శివలక్ష్మిని వివాహం చేసుకొని ఇటిక్యాల గ్రామంలో నివసిస్తున్నాడు. ఇటీవల ముత్తలూరులో జరిగే ఉత్సవాలకు భార్యతో కలిసి కోవెలకుంట్లలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం సాయంత్రం పని నిమిత్తం మోటారు బైక్‌పై కోవెలకుంట్ల నుంచి సౌదరదిన్నె వైపు వెళ్తుంగా వెనుక వైపు నుంచి లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కోవెలకుంట్ల ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

ట్రాక్టరు ట్రాలీ కింద పడి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 3: మండలంలోని కనకాద్రి పల్లె గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి (60) ట్రాక్టర్ ట్రాలీ కింద పడి మృతి చెందాడు. ఇటిక్యాల, కనకాద్రిపల్లె గ్రామాల మధ్య శనివారం ఈ ఘటన జరిగింది. కనకాద్రి పల్లె గ్రామానికి ఇటిక్యాల పాలిష్ ఫ్యాక్టరీ నుండి ట్రాక్టరులో నాపరాయి లోడు చేసుకొని వెళ్తుండగా వాహనం ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ పక్కనే కూర్చున్న భాస్కర్ రెడ్డి ట్రాలీలోని నాపరాళ్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు కొలిమలగుండ్ల హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ



మంత్రాలయం మఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, ఫిబ్రవరి 3. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కోలాహలంగా మారింది. శనివారం మాఘమాసం కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మఠం అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీమఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రుడు

వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం మఠం అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో ఊరేగించారు.

శ్రీమఠంలో పరిమళ ప్రసాదం ధర పెంపు

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పరిమళ ప్రసాదం ధరను పెంచినట్లు ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి రూ.25 ఉన్న ప్యాకెట్ పరిమళ ప్రసాదాన్ని రూ.30 చేసినట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని గంజాయి మయం చేసిన జగన్

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 3: రాష్ట్రాన్ని సీఎం జగన్ మోహన్ రెడ్డి గంజాయిమయంగా మార్చేశాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శనివారం నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత చంద్రబాబు పాలనలో పెట్టుబడులు పెరిగితే.. జగన్‌రెడ్డి పాలనలో గంజాయి ఎగుమతులను పెంచాడని విమర్శించారు. 2014లో రాష్ట్రం విడిపోయి రూ. 16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథం వైపు తీసుకుని వెళ్లేందుకు చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చారని అన్నారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చివేశారని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని యువతను మత్తు పదార్థాలకు, మద్యం, గంజాయికి బానిసలుగా మార్చేశాడని అన్నారు. రాష్ట్రం గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయిందని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రం అన్నివిధాలుగా నష్టపోయిందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నాయకత్వాన్ని బలపరిచి చంద్రన్న పాలనను తిరిగి తెచ్చుకుందామని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

గోకుల్‌రెడ్డి మళ్లీ హౌస్ అరెస్ట్



గోకుల్ కృష్ణారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 3 : జడ్పీటీసీ సభ్యుడు గోకుల్‌రెడ్డిని పోలీసులు మళ్లీ హౌస్ అరెస్టు చేశారు. శనివారం తెల్లవారు జామునే నంద్యాల తాలుకా పోలీస్ అధికారులు, సిబ్బంది మండలంలోని భీమవరం గ్రామంలో ఉన్న గోకుల్ కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను నిర్బంధించారు. సామాజిక మాధ్యమాల్లో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి కటౌట్ చూపుతూ అభ్యంతరకర వ్యాఖ్యల వీడియో వైరల్ అయింది. 'ఎప్పుడన్నా వేటాడే వేటగాళ్లను చూశావా.. నీ అమ్మ మొగుడొచ్చాడు' అనే వ్యాఖ్యలతో ఉన్న వీడియోపై గోకుల్ కృష్ణారెడ్డి మండిపడ్డారు. ఇందుకు నిరసనగా మాతృమూర్తుల ఆత్మగౌరవ దీక్షను శనివారం నంద్యాలలోని గాంధీ చౌక్‌లో చేపట్టాలని నిర్ణయించారు. ఇది తెలుసుకున్న పోలీసులు గోకుల్ ఇంటికి వెళ్లి నిర్బంధించారు. పోలీసులు, గోకుల్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా గోకుల్ మాట్లాడుతూ అధికారం చేతుల్లో ఉంది కదా అని ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా పోస్టులు పెట్టించడం ఎమ్మెల్యేకు సరి కాదన్నారు. వైసీపీ పరువును బజారు కీడుస్తున్నారని, ఈ విషయాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని హెచ్చరించారు. ఎన్నికల్లో టికెట్ తనకేనని విర్రవీగుతున్నారని, సీఎం వద్ద ఉన్న ధనుంజయ్, సజ్జల రామకృష్ణారెడ్డిలను కొనుక్కున్నామని ప్రచారం చేసుకోవడం ఎమ్మెల్యే దిగజారుడుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. డబ్బుందన్న అహంకారంతో నంద్యాల ప్రజలను కొనేస్తానంటే ఎవరూ ఊరుకోరని హెచ్చరించారు. గోకుల్ హౌస్ అరెస్టుతో ఆయన తల్లి భక్తవత్సలమ్మ నంద్యాలలోని ఆంజనేయస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న వైసీపీ కార్యాలయ ఆవరణలో దీక్ష చేపట్టారు. అనంతరం దీక్షా శిబిరం నుంచి మహిళలతో కలిసి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసేందుకు ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో అసహనంతో వెనుదిరిగారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో ఉడిపి సిరూరు మఠం పీఠాధిపతి

మంత్రాలయం, ఫిబ్రవరి 3: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటకలోని అష్ట మఠాలలోని ఉడిపి సిరూరు మఠం పీఠాధిపతి వేద వర్ధన తీర్థులు శనివారం ఉదయం మంత్రాలయం వచ్చారు. స్వామిజీకీ ఆలయ మహా ముఖ ద్వారం వద్ద శ్రీమఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాస రావు, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మఠం పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరించారు.

శ్రీమఠంలో ఉడిపి సిరూరు మఠం పీఠాధిపతి



ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

- దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 3: జిల్లాలోని ఆలయాలకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. ఈనెల 22 లోపు ఆసక్తిగల వ్యక్తులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కుల ధ్రువీకరణతో పాటు ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో కర్నూలు నగరంలోని దేవదాయ శాఖ కార్యాలయానికి నేరుగా కానీ రిజిస్ట్రర్ పోస్టు ద్వారా కానీ పంపాలని తెలిపారు.

తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు

కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం జోన్ 4లో తహసీల్దార్లను బదిలీ చేసింది. ఇందులో భాగంగా బదిలీ పొందిన తహసీల్దార్లకు కలెక్టర్ జి.సృజన శనివారం కొత్త స్థానాలను కేటాయించారు.

పేరు	కేటాయించిన స్థానం
కులశేఖర్	ఏఓ, కలెక్టరేట్
చౌదరి	డి.సెక్షన్, కలెక్టరేట్
నిర్మలాదేవి	బి.సెక్షన్, కలెక్టరేట్
వాసుదేవన్	సి.సెక్షన్, కలెక్టరేట్
ఝాన్సీలక్ష్మి	ఏఓ, ఆర్డీఓ కార్యాలయం
శేషయ్య	ఏఓ, సబ్ కలెక్టరేట్, ఆదోని
నాగభూషణం	ఏఓ, ఆర్డీఓ కార్యాలయం, పత్తికొండ
మోహన్‌కుమార్	కర్నూలు అర్బన్
మునివేలు	కల్లూరు
మాధవరాజు	పత్తికొండ
అనంతాచారి	వెల్దుర్తి
షర్మిల	తుగ్గలి
రజాక్ వలి	మద్దికెర
పద్మజ	చిప్పగిరి
అనురాధ	క్రిష్ణగిరి
శ్రీధర్	మంత్రాలయం
అనుపమ	సి.బెల్‌గల్
గురప్ప	కోడుమూరు
ఓబులేసు	నందవరం
పార్వతి	గోనెగండ్ల
నటరాజ్	ఓర్వకల్లు
అలెగ్జాండర్	కౌతాళం
సురేష్ బాబు	పెద్దకడుబూరు
మురళి	కోసిగి
హసీనాసుల్తానా	ఆదోని
ప్రసాద్ రాజు	హొళగుంద
ఈశ్వరయ్య	దేవనకొండ
బేలయ్య	హాలహర్వి
ఈరమ్మ	ఆస్పరి
చంద్రశేఖర్	ఆలూరు
రామాంజనేయులు	కర్నూలు రూరల్
ఉదయ్ సంతోష్	గూడూరు

కర్ణాటక మద్యం పట్టివేత

కౌతాళం, ఫిబ్రవరి 3: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అక్రమ కర్ణాటక మద్యాన్ని అరికట్టేందుకు మండలంలో కట్టుదిట్టమైన నిఘా ఉంచుతున్నట్లు కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన ఈడిగ శివకుమార్ ద్విచక్రవాహనంపై 5 బాక్సుల(480) కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లను తరలిస్తుండగా తమ సిబ్బందితో కలసి అతన్ని పట్టుకుని 5బాక్సుల కర్ణాటక మద్యం, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 3 : మంత్రాలయానికి చెందిన ఆటో డ్రైవర్ విరుపాక్షిపై పెద్దతుంబళం పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 30వ తేదిన ఆదోని మండలం కుప్పగల్‌కు చెందిన రైతు పండ్ల వ్యాపారి చెన్నారెడ్డి తను పండించిన పండ్లను ఆదోనిలో అమ్ముకొని సొంత గ్రామానికి ఆటోలో బయల్దేరాడు. ఆటో కడితోట సమీపానికి రాగానే డ్రైవర్ ఆటోను నిలిపి ఆ రైతును బెదిరించి రూ.2,900 నగదును తీసుకొని రోడ్డుపై వదిలేసి ఉడాయించాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా డ్రైవర్‌ను గుర్తించామని, త్వరలో అరెస్టు చేస్తామని ఎస్.ఐ పీరయ్య తెలిపారు.



ఆత్మకూరులో వేడెక్కిన రాజకీయం

● జగన్ ఫ్లెక్సీల పక్కనే టీడీపీ ఫ్లెక్సీల ఏర్పాటు



ఆత్మకూరులో ఏర్పాటు చేసిన సిద్ధం.. సంసిద్ధం ఫ్లెక్సీలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 3: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆత్మకూరు ప్రాంతంలో రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. ఎన్నికలకు తాము సిద్ధమంటూ సీఎం జగన్ సిద్ధం పేరుతో చేస్తున్న ప్రచారానికి ఆత్మకూరు పట్టణంలో టీడీపీ శ్రేణులు అందుకు దీటుగా తాము ఎన్నికలకు సంసిద్ధమేనంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంతో పాటు బస్టాండ్ ఎదురుగా కేజీ రోడ్డు పక్కనే గల పలు హోర్డింగ్‌లపై సీఎం జగన్ ఫొటోతో పాటు సిద్ధం పేరుతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ఈ విషయంలో తామూ సంసిద్ధమేనంటూ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అనుచరులు మాజీ ఎమ్మెల్యే బుడ్డా ఫొటోతో పాటు సంసిద్ధమేనంటూ వైసీపీ హోర్డింగ్‌ల పక్కనే టీడీపీ తరుపున ఫ్లెక్సీలను ఉంచారు. అంతేకాకుండా పట్టణంలోని పలు ప్రధాన ఏరియాల్లో కూడా సంసిద్ధమంటూ టీడీపీ ఫ్లెక్సీలను నెలకొల్పారు. అయితే సంసిద్ధం ఫ్లెక్సీల ఏర్పాటుపై పలువురు టీడీపీ నాయకులను సంప్రదిస్తే వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అందుకే ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో సిద్ధం పేరుతో సీఎం జగన్ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ప్రజలు వైసీపీని ఇంటికి పంపించేందుకు సంసిద్ధంగా ఉన్నారని ఈవిషయాన్ని వారికి తెలియజేయాలన్న ఉద్దేశ్యంతోనే తాము సంసిద్ధం ఫ్లెక్సీలను పట్టణంలో ఏర్పాటు చేశామని చెప్పారు. వైసీపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు తాము తగ్గేదే లేదంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గురురాజా పాఠశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 3: నంద్యాలలోని గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ 22వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. గురు రాఘవేంద్ర విద్యా సంస్థల ఛైర్మన్ డా.దస్తగిరిరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల ఛైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, ఐఎంఏ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, కళారాధన సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి డా.రవికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. 22వ సంతోత్సవాల వార్షిక సంచికను ఆవిష్కరించారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదోతరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికం, ప్రతిభాపురస్కారాలు అందజేశారు. 2012-13 విద్యా సంవత్సరంలో పాఠశాలలో విద్యను అభ్యసించి అత్యున్నత శిఖరాలు అధిరోహించిన పూర్వ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి'



రిలే దీక్ష చేస్తున్న దళితులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 3: పట్టణంలోని సొంత ఇళ్లు లేని దళితులకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవికిరణ్ డిమాండ్ చేశారు. చాపిరేవుల గ్రామం కుందూనది సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో నివాసం ఏర్పాటు చేసుకున్న 150 మంది దళితుల ఇళ్లను ప్రభుత్వం తొలగించడంతో శనివారం ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఇంటి స్థలాలు, పక్కాగృహాల మంజూరుకు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. చేసేదేమీలేక ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటే రెవెన్యూ, పోలీస్ అధికారులు సిబ్బందితో గుడిసెలను తొలగించడంతో కట్టుబట్టలతో దళితులు రోడ్డుపై పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన దళితులకు ప్రభుత్వం స్పందించి నివాస స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. మోహన్, విజయ్, దాసు, సుబ్బరాయుడు, రాముడు, నాగేంద్ర, బాధిత మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆత్మకూరు, ఫిబ్రవరి 3: మండలంలో పలు అభివృద్ధి పనులను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం ప్రారంభించారు. వడ్లరామాపురంలో వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. వడ్లరామాపురం నుంచి కొట్టాలచెరువుకు నాబార్డు నిధులతో బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వడ్లరామాపురంలో ముస్లిం శ్మశానం చుట్టూ నిర్మించిన ప్రహరీని ప్రారంభించారు. ముష్టేపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముష్టేపల్లి నుంచి పెద్దఅనంతాపురం గ్రామానికి చేపట్టబోవు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆత్మకూరు మార్కెట్ యార్డులో నాలుగో విడత ఆసరా కార్యక్రమంలో ఆత్మకూరు, అర్బన్ మండలానికి సంబంధించి 994 పొదుపు గ్రూపులకు రూ.4,58,21,859 చెక్కును పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఏపీఎం పుల్లయ్య, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

మున్సిపల్ ఛైర్మన్ గైర్హాజరు

ఆత్మకూరు పట్టణంలో శనివారం నిర్వహించిన నాలుగో విడత ఆసరా కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, ఆమె తండ్రి, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్ హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. గత కొంతకాలంగా మున్సిపల్ ఛైర్మన్, ఆమె తండ్రి అధికార పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. అలాగే కొంతమంది కౌన్సిలర్లు కూడా ఆసరా కార్యక్రమానికి హాజరు కానట్లు సమాచారం.

'రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి'

పగిడ్యాల, ఫిబ్రవరి 3: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారుల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, నందికొట్కూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ విజయ్ తెలిపారు. పగిడ్యాల సచివాలయంలో చేపట్టిన ఇంటిస్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. వివిధ గ్రామాల్లో 1444 మంది లబ్ధిదారుల ఇండ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ గత నెల 27వ తేదీన ప్రారంభమైనప్పటికీ టెక్నికల్ సమస్యలతో రిజిస్ట్రేషన్లు ముందుకు సాగకపోవడంతో సిబ్బంది రిజిస్ట్రేషన్ చేసేందుకు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగేంద్రమయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రా రెడ్డి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఏం చేశారని ఓటు వేయాలి?

● వర్ధన్ బ్యాంకు పేరిట రూ.30 కోట్ల దోపిడీ ● ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఫైర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 3: ఐదేళ్లలో ఏం చేశారని ప్రజలు ఓట్లు వేయాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మండిపడ్డారు. ఆత్మకూరులోని వెంగళరెడ్డి నగర్‌లో శనివారం 'జయహో బీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. బుడ్డా మాట్లాడుతూ ఎక్కడి నుంచో వలస వచ్చి ఆత్మకూరు ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి గెలిచిన ఎమ్మెల్యే శిల్పా ఐదేళ్లలో ఏం చేశారని ప్రశ్నించారు. 35 ఏళ్లలో జరగని అభివృద్ధి తానే చేశానని ప్రచారం చేసుకునే శిల్పా అసలు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పమంటే నోరు మెదపడం లేదని అన్నారు. ఎన్నికల సమయంలో జగన్ 40హామీలు ఇస్తే.. చక్రపాణిరెడ్డి 400 హామీలు ఇచ్చి ఇక్కడి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. వర్ధన్ బ్యాంకును ప్రారంభించి మూడు నెలల్లోనే రూ.30కోట్లను కాజేసిన ఘనుడని అన్నారు. ఆత్మకూరులో ఇళ్ల స్థలాల పంపిణీ బుడ్డా కుటుంబ చలువేనని గుర్తు చేశారు. ఆనాడు తన సోదరుడు బుడ్డా సీతారామిరెడ్డి హయాంలో 130 ఎకరాలను కొనుగోలు చేయించి పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తే వాటిని రద్దు చేసి పేదప్రజలకు తీరని ద్రోహం చేసిన వ్యక్తి శిల్పా అని మండిపడ్డారు. తనది పక్కనే ఉన్న వేల్పనూరు ఇక్కడి ప్రజలకు ఏకష్టమొచ్చినా ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. వలసొచ్చిన ఎమ్మెల్యే శిల్పాకు ఇక్కడి ప్రజల కష్టాలు తెలియవని, ఎన్నికల్లో ఓడిపోతే ఊరు వదిలివెళ్తారన్న విషయాన్ని ప్రజలు గుర్తించుకోవాలని సూచించారు. ఇదిలావుంటే అనేక మార్లు తన టిక్కెట్ గురించి ఎమ్మెల్యే శిల్పా ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు నూటికేసులిచ్చి టిక్కెట్లు తీసుకునే సంప్రదాయం తమ కుటుంబానిది కాదని, తామేంటో తమ అధినాయకుడు చంద్రబాబుకు తెలుసని అన్నారు. జగన్ పాలనతో రాష్ట్రం సర్వనాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు సముచితస్థానం కల్పించి వారి అభ్యున్నతికి పాటుపడింది టీడీపీనేనని గుర్తుచేశారు. అంతకుముందు సంగమేశ్వరం సర్కిల్‌లో జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ తిరుపాలుబాబు, బీసీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, వేణుగోపాల్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కలిముల్లా, రాష్ట్ర కార్యదర్శి నాగూర్‌ఖాన్, నాయకులు అబ్దుల్లాపురం బాషా, ఆర్టీసీ రామకృష్ణ, ఇరగదిండ్ల మురళీ, దగ్గుపాటి శ్రీనివాసులు, హరిగౌడ్, మాయలూరి రమణ, రమేష్‌గౌడ్, నగేష్ యాదవ్, మేడం శ్రీనివాసులు, ఎం.శివ, పాల శివ, బంగారయ్య, బోయ మల్లికార్జున, నాగేశ్వరగౌడ్ తదితరులు ఉన్నారు.



అభివాదం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా, బీసీ నాయకులు

● శ్రీశైల నియోజకవర్గం పరిధిలో మహిళల జీవనోపాధుల కల్పనకు తనవంతు కృషి తప్పక చేస్తానని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరులో కుట్టుమిషన్, అల్లికల్, వులెన్ వర్క్ శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. బుడ్డా మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే ముస్లింలకు న్యాయం జరిగిందని, వైసీపీ పాలనలో తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. స్పోర్ట్స్ క్లబ్ ఛైర్మన్ పస్పీల్ మున్నా, టీడీపీ నాయకులు వెన్నా శ్రీధర్‌రెడ్డి, రాజారెడ్డి, అడ్వకేట్ నూర్‌అహ్మద్, సుబ్బయ్య, రేడియం నూర్, రవీంద్రబాబు తదితరులు ఉన్నారు.

'అతివేగం ప్రమాదకరం'



ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సీఐ, ఎంవీఐ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 3: అతివేగం అత్యంత ప్రమాదకరమని ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ అన్నారు. రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా శనివారం నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు, మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ, ఎంవీఐ మాట్లాడుతూ మోటార్‌సైకిళ్లపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ద్విచక్రవాహనాలపై అతివేగంగా ప్రయాణించడం ద్వారా మీకే కాకుండా ఎదుటివారికి కూడా ప్రమాదం జరగవచ్చన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మోటార్‌సైకిళ్లను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ర్యాలీ పట్టణంలోని ఐటీసీ సెంటర్ నుంచి ప్రారంభమై వై జంక్షన్, మున్సిపల్ ఆఫీస్, సంజీవనగర్‌గేట్, శ్రీనివాససెంటర్‌మీదుగా టెక్కె మార్కెట్‌యార్డు వరకు కొనసాగింది. ర్యాలీలో ట్రాఫిక్ ఎస్ఐలు, పట్టణ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, పలువురు డ్రైవింగ్ స్కూళ్లవారు, ఔత్సాహికులు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

మహానందిలో ఎస్కేయూ వీసీ పూజలు

మహానంది, ఫిబ్రవరి 3: మహానంది క్షేత్రంలో అనంతపురంలోని ఎస్కే యూనివర్సిటీ ఉపకులపతి హుస్సేన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయ ముఖ మంటపం వద్ద వీసీకి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో ఆయన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు జరిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందచేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, ఫిబ్రవరి 3: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం అద్దంకికి చెందిన ఎ.శేషసాయి అనే భక్తుడు రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

నేడు నందికొట్కూరులో 'జయహో బీసీ'

నందికొట్కూరు ఫిబ్రవరి 3: నందికొట్కూరులో ఆదివారం జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌గౌరు వెంకటరెడ్డి ఓ ప్రకటనతో తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని బ్రహ్మంగారి మఠంలోని ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ



కురుకుంద గ్రామంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 3: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గొడవలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ లక్ష్మీనారాయణ గ్రామస్థులను హెచ్చరించారు. మండలంలోని కురుకుంద గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సభను ఏర్పాటు చేసి గ్రామంలోని సమస్యలపై చర్చించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జరిగే నేరాలకు శిక్షలు కఠినంగా ఉంటాయని తెలిపారు. గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, నాటు సారా తయారి, అమ్మకాలు, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణాలతో, అతి వేగంతోనే ప్రమాదాలు సంభవించి తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని, అలా జరుగ కుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 3: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం హనుమకొండకు చెందిన నృత్యస్రవంతి కూచిపూడి కళానిలయం బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వినాయకకౌత్వం, శివాష్టకం, శంకరశ్రీగిరి, ఓం నమఃశివాయ, జతిస్వరం, శివస్తుతి, కాలభైరవాష్టకం తదితర గీతాలకు శరణ్య, భ్రమరి, శ్రీనిధి, విలాసిని, అక్షదసిరి, సంకీర్తన, లాస్య, విన్మయి, ధృతిశ్రీ, సిరిచైత్రిక, వరాళిక, అపూర్వ, వైష్ణవి, సింధూజ ప్రియ, బృంద సహస్ర తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

కలెక్టర్‌ను కలిసిన మహానంది ఆలయ ఈవో



కలెక్టర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఈవో చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది, ఫిబ్రవరి 3: నంద్యాల నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కె. శ్రీనివాసులును శనివారం మహానంది దేవస్థానం ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి కలిశారు. నంద్యాల కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఈవోతో పాటు ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్నలు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాసులు శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

సర్వేయర్ నియామకం: మహానంది ఆలయానికి చెందిన భూముల సర్వేకు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తాత్కాలికంగా ఒక సర్వేయర్‌ను నియమించారు. ఇటీవల మహానందికి దర్శనార్థమై వచ్చిన జేసీని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి కలిశారు. ఆలయానికి చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు సర్వేయర్‌ను నియమించాలని కోరారు. ఇందులో భాగంగానే శనివారం నంద్యాల్లోని కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఈవోతో పాటు వేదపండితులు కలిశారు. శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. సర్వే తర్వాత భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులు ఏర్పాటు చేసుకోవాలని జేసీ తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ

నంద్యాల (కల్చరల్): నంద్యాల నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కె. శ్రీనివాసులును శనివారం నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పీపీ నాగిరెడ్డి లిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు.

ఆడ్వాణీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 3: బీజేపీ నేత లాల్ కృష్ణ ఆడ్వాణీకి భారత రత్న అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందని బీజేపీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యకర్తలు కోలాహలంతో పాటు, టపాసులు పేల్చి, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, అలాగే అయోధ్య రామమందిరం నిర్మాణానికి ఆయన కృషి ఎనలేనిదని అభిరుచి మధు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 3: నంద్యాలలోని నందిఫైప్స్ బ్యాడ్మింటన్ అకాడమిలో ఉమ్మడి కర్నూలు జిల్లా మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి దిశ డీఎస్పీ మారుతీరావు, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వంశీధర్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శేషిరెడ్డి, సంజీవరెడ్డి హాజరయ్యారు. మాస్టర్స్ పోటీల్లో సింగల్స్, డబుల్స్ 55 సంవత్సరాల విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. గెలుపొందిన క్రీడాకారులు ఫిబ్రవరి 16నుంచి 18వ తేదీవరకు రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని వంశీధర్ తెలిపారు. కార్యక్రమంలో కోచ్ నాగార్జున, చైతన్యరెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 3: ఆత్మకూరు మండల ఎంపీడీవోగా కె.శ్రీనివాసరెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ కడప జిల్లా నుంచి ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ఆత్మకూరుకు బదిలీ కావడంతో ఆత్మకూరులో ఎంపీడీవోగా శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో మోహన్‌కుమార్‌ను సత్యసాయి జిల్లా సీకేపల్లి మండలానికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ఎంపీడీవోను ఆహ్వానించారు. సూపరింటెండెంట్ మోహన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు బాలు నాయక్, జీవన్, శివశంకర్‌రెడ్డి, ప్రభాకర్, సిబ్బంది, సర్పంచ్‌లు ఉన్నారు.

పాములపాడు: పాములపాడు ఎంపీడీవోగా వి.సరస్వతి శనివారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగంగా అనంతపురం జిల్లా పరిగి మండలం నుంచి పాములపాడులకు బదిలీ అయ్యారు. పాములపాడు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న గోపీకృష్ణ అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో కార్యలయ సిబ్బంది నూతన ఎంపీడీవోను మర్యాద పూర్వకంగా కలిశారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు మండల నూతన ఎంపీడీవోగా సగిలి విజయరావు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న వాసుదేవగుప్త అనంతపురం జిల్లా లేపాక్షి మండలానికి బదిలీపై వెళ్లారు. కడప జిల్లా ఓబులంవారిపల్లె మండల ఎంపీడీవో విజయరావును బండిఆత్మకూరుకు నియమించారు. శనివారం బాధ్యతలు చేపట్టిన నూతన ఎంపీడీవోకు మండల సూపరింటెండెంట్ హనీఫ్‌ఖాన్, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏపీవో వసుధ, ఏఈ లక్ష్మీనరసింహ శుభాకాంక్షలు తెలియజేశారు. కిరణ్‌కుమార్, ఫణీంద్ర ఉన్నారు.

గడివేముల: గడివేముల ఎంపీడీవోగా శనివారం ఎస్.శివరామిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడ ఎంపీడీవోగా పని చేస్తున్న శివమల్లేశ్వరప్ప కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి బదిలీ కాగా కడప జిల్లాలోని చిట్వేలి నుంచి ఎంపీడీవో శివరామిరెడ్డి గడివేములకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అబ్దుల్ ఖాలిక్, కార్యదర్శులు పాల్గొన్నారు.

'సమన్వయంతో సత్ఫలితాలు'



మాట్లాడుతున్న ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎహెజ్కేలు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 3: పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీసుల మధ్య సమన్వయం, సరైన ఆధారాలతో కేసులలో సత్ఫలితాలు సాధించవచ్చని ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ వి.ఎహెజ్కేలు అన్నారు. నంద్యాలలో సూరజ్‌గ్రాండ్ హాల్‌లో శనివారం పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారుల మధ్య సమన్వయంపై సమీక్షా సమావేశం జరిగింది. ఎహెజ్కేలుతో పాటు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి హాజరయ్యారు. క్రిమినల్ కేసులలో పోలీస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మధ్య సమన్వయం ఎలా ఉండాలన్న అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. దర్యాప్తు అధికారి తప్పు చేసినవారికి శిక్ష పడేలా చర్యలు తీసుకోవడంలో ముఖ్య పాత్ర పోషించాలని కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరించి కోర్టులో సమర్పించాలని వివరించారు. 2024 సంవత్సర ప్రాసిక్యూషన్స్ డైరీని వారు విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రాసిక్యూషన్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు మహా పుష్పయాగం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 3: నంద్యాల వాసవీ దీక్షామండలి ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ మాతకు పుష్పయాగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వాసవీ దీక్షా మండలి అధ్యక్షుడు యినుగూరి రమేష్‌బాబు తెలిపారు. శనివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 102 మంది మహిళలతో చెరువు కట్ట నుండి అభిషేక జలాన్ని ఊరేగింపుగా అమ్మవారిశాలకు తీసుకొని వచ్చి అమ్మవారికి అభిషేకం, అనంతరం వివిధ రకాలైన ఫల, పుష్ప, సుగంధ ద్రవాలు, పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తర్వాత అమ్మవారిని వివిధ రకాలైన పుష్పాలతో విశేష అలంకారం, మంగళ హారతులు, మహా మంగళ హారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంకాలం అమ్మవారిశాల నుంచి గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం, దీపోత్సవం, కోలాటం, కేరళ వాయిద్యాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు మండలి గౌరవ అధ్యక్షులు సంపత్‌కుమార్ తెలిపారు. పుష్పయాగం అనంతరం లడ్డూ వేలం పాట ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మంచికంటి శ్రీరాములు, అంజనీకుమార్, పోలా అనిల్, రాజు, వెంకటేష్, ప్రింటర్ కృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నంద్యాలలో ధార్మిక ప్రవచనాలు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 3: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల కోట వీధిలో వెలసిన సీతారామసమేత త్యాగరాజస్వామి దేవస్థానంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలోని శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనం చేశారు. భగవద్గీతను ఆశ్రయిస్తే సకల శోకాల నుంచి విముక్తిని కలిగించి, మానవుడికి జన్మరాహిత్యాన్ని కలిగిస్తుందని ప్రముఖ వ్యాఖ్యాత, సంస్కృత పండితులు డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు అన్నారు. కార్యక్రమంలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లువెంకటరెడ్డి, రామాయణం శివరామకృష్ణ, శ్రీనివాసులు, సురేష్‌బాబు, అర్చకులు,భజనమండలి అధ్యక్షులు బాల నాగిరెడ్డి పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలను ప్రజలకు తెలపాలి'

వెలుగోడు, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి గ్రామాలు, పట్టణాలలోని ప్రజలకు తెలియజేయాలని ప్రోగ్రాం కన్వీనర్ ప్రతాప్ ఆచారి, కో కన్వీనర్ లబ్బి మధు సూచించారు. బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని ఈ నెల 9 నుంచి గ్రామాలు, పట్టణాలలో ప్రారంభిస్తుండడంతో వెలుగోడులో శనివారం కో ఆర్డినేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, తిరుపాల్ నాయక్, శేఖర్, లబ్బి మహేశ్, రమణ, శ్రీనివాసులు, వెంకటేశ్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సేవలతోనే శాశ్వత గుర్తింపు'



ఎంపీడీవో వాసుదేవగుప్తను సన్మానిస్తున్న ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 3: అధికారి ప్రజలకు తను అందించి సేవలే శాశ్వతగుర్తింపునిస్తాయని మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి, ఏవో హనీఫ్‌ఖాన్ అన్నారు. బదిలీపై అనంతపురం వెళ్లిన ఎంపీడీవో వాసుదేవగుప్తను శనివారం సాయంత్రం ఎంపీపీ, మండలంలోని పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, ఉపాధి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

'వ్యవసాయ రంగానికి అన్యాయం'



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అన్యాయం జరిగిందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఆత్మకూరు మండలాధ్యక్షులు మాబాష, కార్యదర్శి వీరన్న ఆరోపించారు. శనివారం ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఆయా సంఘాల నాయకులు కృష్ణ, రవీంద్ర, కిరణ్, సురేంద్ర, శివకుమార్, రజాక్, రామ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పగిడ్యాల, ఫిబ్రవరి 3: పగిడ్యాలకు చెందిన టీడీపీ నాయకుడు గోకారి తల్లి జంగం డవలమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో టీడీపీ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గిత్త జయసూర్య, మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి నివాళి అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసురెడ్డి, దామోదర్‌రెడ్డి, విజేయుడు, పాండు తదితరులు ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు

చాగలమర్రి, ఫిబ్రవరి 3: చాగలమర్రి ఎంపీడీవోగా సూర్యనారాయణరెడ్డి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి చాగలమర్రికి బదిలీపై వచ్చారు. ఎన్నికలకు సంబంధించి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్‌దౌల అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే తహసీల్దార్‌గా కడప జిల్లా నుంచి ఏపీ రమణమ్మను చాగలమర్రి తహసీల్దార్‌గా నియమించారు.

శిరివెళ్ల: శిరివెళ్ల మండల ఎంపీడీవోగా ఫణి రాజకుమారి శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో కేవీ సుబ్రమణ్యం చిత్తూరు జిల్లాకు బదిలీ కావడంతో వైఎస్సార్ కడప జిల్లాలోని రాజంపేట నుంచి ఎంపీడీవో ఫణి రాజకుమారి శిరివెళ్లకు బదిలీపై వచ్చారు. ఈవోపీఆర్డీ నాగేంద్రుడు, మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు నూతనంగా వచ్చిన ఎంపీడీవో ఫణి రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రుద్రవరం: రుద్రవరం ఎంపీడీవోగా రామచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని ఉద్యోగులకు సూచించారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను కార్యదర్శులు, అధికారులు పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, సీనియర్ అసిస్టెంటు షుక్రక్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అవుకు: అవుకు ఎంపీడీవోగా మల్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీలో భాగంగా అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి బదిలీపై వచ్చారు. అవుకు ఎంపీడీవోగా పనిచేస్తున్న వెంకటే శ్వర్‌రెడ్డి హిందుపురానికి బదిలీపై వెళ్లారు.

డోన్(రూరల్): డోన్ ఎంపీడీవోగా ఏవీ శ్రీనివాసులు శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం మిడపనకల్లు మండలం ఎంపీడీవోగా ఉన్న ఏవీ శ్రీనివాసులు బదిలీపై డోన్ ఎంపీడీవోగా వచ్చి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో ఎం.శ్రీనివాసులు అనంతపురం జిల్లా గుత్తి మండలానికి బదిలీ అయ్యారు.

ప్యాపిలి: ప్యాపిలి ఎంపీడీవోగా శనివారం సాయి మనోహర్ బాధ్యతలు చేపపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఫజుల్‌రహిమాన్ కడప జిల్లా మైదుకూరుకు బదిలీ అయ్యారు. దీంతో సత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన సాయి మనోహర్‌ను ప్రభుత్వం నియమించింది.

తహసీల్దార్‌గా మురళీమోహన్

రుద్రవరం, ఫిబ్రవరి 3: రుద్రవరం తహసీల్దారుగా చిత్తూరు జిల్లా కేంద్రంలో పని చేస్తున్న మురళీమోహన్‌ను ఉన్నతాధికారులు నియమించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు రెవెన్యూ వర్గాలు శనివారం తెలిపాయి.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

చాగలమర్రి, ఫిబ్రవరి 3: మండలంలోని మల్లేవేముల గ్రామంలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో-2 న్యామతుల్ల శనివారం పరిశీలించారు. పాఠశాలను సందర్శించి సంబంధిత రికార్డులను, విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని సూచించారు. అలాగే చింతలచెరువు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ తనిఖీ చేశారు. విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధురి, సీఆర్పీలు అమీర్‌ఖాన్, ఖాశీం పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

డోన్(రూరల్), ఫిబ్రవరి 3: ప్రణాళికాబద్ధంగా చదివితే.. పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తాయని, జిల్లా సంక్షేమ హాస్టళ్ల అధికారి (డీఎస్‌డబ్ల్యూ) ఎం. చింతామణి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్‌లో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ప్రేరణ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చింతామణి మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో బనగానపల్లె ఏఎస్‌డబ్ల్యూవో దిలీప్ బాషా, డోన్ ఎస్సీ బాలురు బాలికల సంక్షేమ హాస్టల్స్ వార్డెన్స్ లక్ష్మీబాయి, ఎన్. మధు, ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ అమరేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

'టీడీపీతోనే బీసీల సాధికారత'

చాగలమర్రి, ఫిబ్రవరి 3: టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమని దూదేకుల సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. శనివారం నెల్లూరు జిల్లా కస్నూరు మస్తాన్‌వలి దర్గా వద్ద టీడీపీ అధికారంలోకి రావాలని కోరుతూ ప్రత్యేక ఫాతెహాలు చేశామని మహబూబ్‌బాషా చెప్పారు. ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని అన్నారు. బీసీలంతా ఐకమత్యంతో టీడీపీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు లాల్‌బాష, పీరయ్య, మస్తాన్, పక్రుద్దీన్ ఉన్నారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

బనగానపల్లె, ఫిబ్రవరి 3: యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు సంబంధించి మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి, సంస్థ జిల్లా అధికారి ప్రతాప్‌లు శనివారం తెలిపారు. శిక్షణ పొందిన వారికి ఉపాధి కల్పిస్తామన్నారు. ఇంటర్, ఆపైన చదివిన విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8465925341, 9705998056 నంబరును సంప్రదించాలని సూచించారు.

జనసేన కార్యకర్త మృతికి నివాళి

బనగానపల్లె, ఫిబ్రవరి 3: మండలంలోని జిల్లెళ్ల గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త రవికుమార్ (24) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం జనసేన కోఆర్డినేటర్ సురేశ్ ఆధ్వర్యంలో రవికుమార్ చిత్రపటానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు భాస్కర్, చిన్నబాబు, గుర్రప్ప, నాగపర సాద్, కిట్టు, అజిత్‌రెడ్డి, ప్రసాద్, కాశీం, షేక్షావలి పాల్గొన్నారు.

'మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి'

శిరివెళ్ల, ఫిబ్రవరి 3: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శిరివెళ్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరాలో భాగంగా మండలంలోని 972 స్వయం సహాయక సంఘాలకు రూ.8.31 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే శనివారం పొదుపు మహిళలకు అందజేశారు. సాయంత్రం మండలంలోని యర్రగుంట్లలో పలు కాలనీల్లో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ నాయక్ మహమ్మద్ వశీం, జడ్పీ వైస్ చైర్మన్ నాయక్ దిల్షాద్, వైసీపీ మండల కన్వీనర్ ఇందూరి ప్రతాప్‌రెడ్డి, సలాం, నజీర్, తిమ్మరాయుడు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసు నమోదు

రుద్రవరం, ఫిబ్రవరి 3: మండలంలో బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారం చేసినట్లు కేసు నమోదయింది. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాలివీ.. జనవరి 9న ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువకుడు తన కూతురిపై అత్యాచారం చేశాడని బాలిక తల్లి ఫిబ్రవరి 2న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మురారి ఓబులేసు అనే యువకుడిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'పల్లెల్లో ప్రశాంత జీవనం గడపాలి'

రుద్రవరం, ఫిబ్రవరి 3: పల్లెల్లో ప్రజలు ప్రశాంత జీవనం గడపాలని సీఐ వంశీధర్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని ఆలమూరు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. చిన్న చిన్న విషయాలకు గొడవకు పోకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. ఏదైనా ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు.. కారక్రమంలో ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం

» మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



మాట్లాడుతున్న అఖిలప్రియ

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 3: వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డలోని మాజీ మంత్రి అఖిలప్రియ స్వగృహంలో శనివారం బీసీ జయహో సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ జగన్ రాక్షస పాలన కొనసా గిస్తున్నారని ఆరోపించారు. బీసీలకు చంద్రబాబు అమలు చేసిన 34 పథకా లను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని ధ్వజమెత్తారు. విద్యావంతులకు మద్యం విక్రయించే ఉద్యోగాలు ఇవ్వడంతో తల్లిదండ్రులు తమ పిల్లలు చేస్తున్న ఉద్యోగాలను చెప్పుకోలేక పోతున్నారన్నారు. పలువురు ప్రజాప్రతి నిధులు పోలీసులను అడ్డుపెట్టుకొని గూండాయిజం, రౌడీయిజం, మద్యం, గంజాయి, డ్రగ్స్ తదితర వాటిని ప్రోత్సహించి యువతను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రజా ప్రతినిధులు ఐదేళ్లలో దోచుకొని దాచుకొని పారిపోయేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేసిన అన్యాయాన్ని గ్రామాల్లోని ప్రజలకు వివరిం చాలని సూచించారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఓసీలు సైనికుల్లా పని చేసి టీడీపీని గెలిపించుకోవాలన్నారు. చంద్రబాబు బీసీలకు చంద్రన్న బీమా కింద లక్షల మందికి న్యాయం చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆళ్ల గడ్డ నియోజకవర్గంలోని యువతకు ఏడాదికి ఐదు వేల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పారు. భూమా విఖ్యాత్‌రెడ్డి, బార్గవ్‌రామ్‌నాయుడు, బీసీ నాయకులు గుర్రప్పయాదవ్, నాగేశ్వరరావు, రామకృష్ణ, అహోబిలం సంజీవరాయుడు, సల్లా నాగరాజు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి కథనంపై భుజాలు తడుముకున్న ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి దినపత్రికలో గత నెల 31న వచ్చిన కథనంపై ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి భుజాలు తడుముకున్నారని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. ఆ కథనంలో జిల్లాలోని ఓ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే అని రాశారే తప్ప ఆ ఎమ్మెల్యే పేరు, నియోజకవర్గం పేరు ఎక్కడా లేదని అన్నారు. అయితే ఎమ్మెల్యే ప్రెస్‌మీట్ పెట్టడంతో పాటు కథనం రాసిన విలేకరులపై విరుచుకపడి తన హుందాతనాన్ని దిగజార్చుకున్నారని అన్నారు. తనపై ఓ పత్రికలో ఎన్నో కథనాలు వచ్చాయని, అయితే ఆ విలేకరులపై తాను చిందు లు వేయలేదని గుర్తు చేశారు.

నేరాలకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్, ఫిబ్రవరి 3: ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శనివారం రాత్రి పట్టణంలోని చిగురుమానుపేటలో రాబోయే ఎన్నికలు, సైబర్ నేరాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఘర్షణలకు తావు లేకుండా నడుచుకోవాలన్నారు. ఆన్‌లైన్ యాప్ మోసాల పట్ల జాగ్రతగా ఉండాలని సూచించారు. సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 3: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నందివర్గం ఎస్‌ఐ తిరుపాలు ప్రజలకు సూచించారు. శనివారం రాత్రి పలుకూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాటాడుతూ కొందరు ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్నారని, వారి పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పేకాట, జూదం, నాటుసారా అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేంకటేశ్వరస్వామికి కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం, ఫిబ్రవరి 3: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామికి సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వేంకటేశ్వరస్వామి, లక్ష్మీగోదాదేవి, మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు అర్చకులు వారణాసి గోపీశర్మ శనివారం వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

నరసింహస్వామి ఆలయాల్లో పూజలు: మండలంలోని నరసాపురం, రుద్రవరంలోని గుట్టకొండ, దొర్ని లక్ష్మి నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి వేద మంత్రోచ్చరణల మధ్య పూజలు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

వైసీపీకి పతనం తప్పదు: టీడీపీ



టీడీపీ మేనిఫెస్టో పత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

డోన్, ఫిబ్రవరి 3: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీకి పతనం తప్పదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు సీయం శ్రీనివాసులు, నియోజకవర్గ యువ నాయకుడు ధర్మవరం గౌతంరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని 22వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీయం శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ అసమర్థ పాలనతో ప్రజలపై అప్పుల భారం పెరిగిందని అన్నారు. గౌతం రెడ్డి మాట్లాడుతూ వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ రఫీ, చక్రపాణిగౌడు, ఎల్ఐసీ శ్రీనావాసులు, నాగేంద్ర, ప్రభాకర్, దస్తగిరి, షేక్షావలి పాల్గొన్నారు.

చాగలమర్రి: వైసీపీ అరాచక పాలనకు పతనం తప్పదని, ఆ పార్టీకి వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇండ్ల రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రామ్మోహన్, ఉసేన్‌రెడ్డి, డీఎం బాషా, నర్సయ్య, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలపాడులో..

కరెంట్ లేని పీహెచ్‌సీ

పాత భవనంలోనే వైద్య సిబ్బంది విధులు



పాత భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

రుద్రవరం, ఫిబ్రవరి 3: మండలం లోని ఆల మూరులో రూ.ఒక కోటి 85 లక్షలా 75వేలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మించారు. ఈ భవనాన్ని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఏపీ జల వనరుల శాఖ సలహాదారుడు గంగుల ప్రభాకరరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి జనవరి 19న ప్రారంభించారు. భవనానికి ఇంత వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేదు. వైద్య సిబ్బంది వైద్యాధికారులు పాత భవనంలోనే పెచ్చులూడిపడుతుంటే మరో వైపు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు మాత్రం ప్రారంభించి వెళ్లారు. ఇక్కడ విద్యుత్ సరఫరా లేకపోవడంతో వైద్య సిబ్బంది, వైద్యాధికారులు పాత భవనంలోనే కొనసాగుతున్నారు. ఈ విషయంపై వైద్యాధికారి అమర్ నాథరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సరషఫరా లేకపోవడంతో పాత భవనంలోనే విధులు కొనసాగిస్తున్నామని, సంబంధిత కాంట్రాక్టరు, ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.



ఆలమూరులో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

అవుకు, ఫిబ్రవరి 3: విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ రమణయ్య హత్యను ఖండిస్తూ అవుకు తహసీల్దారు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విశాఖపట్నంలో తహసీల్దారు రమణయ్యను తన ఇంటి వద్దనే దుండగులు హత్య చేయడం దారుణమన్నారు. హత్య చేసిన నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు

శిరివెళ్ల, ఫిబ్రవరి 3: మండలంలోని కోటపాడు గ్రామంలో వెలసిన కేశవస్వామి, వీరభద్ర స్వామి ఆలయాలకు వేరువేరుగా ధర్మకర్తల నియామకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కోటపాడు గ్రూప్ దేవాలయాల ఈవో వేణునాథరెడ్డి శనివారం తెలిపారు. ధర్మకర్తలుగా ఉండేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని రైతునగరంలో ఉన్న దేవాదాయశాఖ జిల్లా కార్యాలయంలో ఈ నెల 21వ తేదీలోగా అందజేయాలని తెలిపారు. ధర్మకర్తల నియామక నోటిఫికేషన్, అర్హత సంబంధిత వివరాల కోసం 8333811586, 9491633491 నెంబర్లను సంప్రదించాలని ఈవో సూచించారు.

నేడు ఆది అల్లూరి ఎరుకలి స్వామి ఆరాధన

దొర్నిపాడు, ఫిబ్రవరి 3: మండలంలోని దొర్నిపాడు కోటలో వెలసిన ఆది అల్లూరి ఎరుకలిస్వామి ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ప్రాతఃకాల పూజ, జానపద గీతాలు, భక్తి పాటలు, భగవద్గీత పారాయణం, భజన కార్యక్రమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు, జిల్లా నాయకుడు చక్రవర్తి నాయుడు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తి భావం అలవర్చుకోవాలి



పూజారిని సత్కరిస్తున్న బ్రహ్మానందచారి తదితరులు

బనగానపల్లె, ఫిబ్రవరి 3: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందచారి అన్నారు. శనివారం మండలంలోని పలుకూరు గ్రామంలోని శివాలయంలో బ్రహ్మానందాచారి ఆధ్వర్యంలో భక్తి మార్గంపై, ఆధ్యాత్మిక చింతనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పూజారి భాస్కర్‌ను ఘనంగా సత్క రించారు. కార్యక్రమంలో శివ మాలధారులు వెంకటరమణ, శ్రీనివాసులు, పర మేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ

బనగానపల్లె, ఫిబ్రవరి 3: మండలంలోని పలుకూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కుమారస్వామిరెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

గ్రామ సేవకుడి మృతి

రుద్రవరం, ఫిబ్రవరి 3: మండలంలోని బీరవోలుకు చెందిన గ్రామ సేవకుడు హుసేన్‌సా (58) శనివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రభుత్వం తరఫున అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం తోటి గ్రామ సేవకులతో అందించినట్లు వారు తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 3: ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామం నుంచి రుద్రవరం మండలంలోని గుర్రప్ప మాన్ల వరకు తారు రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. కాటన్ బోర్డు మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి (వాసు), పడకండ్ల సుధాకరెడ్డి, భాస్కరరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయంలో అన్నదానం

చాగలమర్రి, ఫిబ్రవరి 3: చాగలమర్రిలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం అన్నదాన క్యాక్రమాన్ని ప్రారంభించారు. అహోబిల లక్ష్మీనరసింహ స్వామి దీక్ష చేపట్టిన మాలదారులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు శనివారం ప్రారంభించారు. దీక్ష చేపట్టిన మాలధారులకు 40 రోజుల పాటు ఆలయంలో భిక్ష ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కొండయ్య, గురుస్వాములు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



పరీక్షా ప్యాడులు పంపిణీ చేస్తున్న దాత శ్రీనివాసులు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 3: కొలిమిగుండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పబ్లిక్ పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ప్యాడులు, పెన్నులు గ్రామానికి చెందిన శ్రీనివాసులు పంపిణీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండారు శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడతాయని దాత శ్రీనివాసులు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, బాలఓబన్న, నాగమల్లేసుడు, బీసీ ఓబయ్య, రాజాదిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

పొగాకు సాగుకు ఆసక్తి



నరసాపురంలో సాగు చేసిన పొగాకు

రుద్రవరం, ఫిబ్రవరి 3: రైతులు పొగాకు సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. గతంలో లేని విధంగా సుమారు 600 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. మండలంలోని కోటకొండ, బి.కొట్టాల, శ్రీరంగాపురం, నరసాపురం, ముత్తలూరు, పెద్దకంబలూరు, ఆలమూరు రెడ్డిపల్లె గ్రామాల్లో సాగు చేశారు. ఈ పంట 120 రోజుల్లో చేతికందుతుంది. క్వింటా పొగాకు రూ.15వేలు పలుకుతోంది. ధర ఆశాజనకంగా ఉన్నందుకే పొగాకు సాగు చేసేందుకు రైతుల చూపు పొగా సాగు వైపు మళ్లింది.

ఆరు ఎకరాల్లో సాగు చేశా

పొగాకు పంటను వ్యవసాయ బోరు బావుల కింద ప్రస్తుతం ఆరు ఎకరాల్లో సాగు చేశా. పెట్టుబడి తక్కువ, దిగుబడి ఎక్కువ వస్తుంది. అందుకే పొగాకు పంటను సాగు చేశా.

- నాగేషుడు, రైతు, కోటకొండ

వీరాంజనేయ స్వామికి పూజలు



వీరాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఫిబ్రవరి 3: చాగలమర్రిలోని గాంధీ బజార్‌లో ఉన్న వీరాంజనేయస్వామికి శనివారం మహిళలు సామూహికంగా ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో జల, క్షీరాభిషేకాలు చేశారు. మహిళలు తమలపాకులతో స్వామికి అభిషేకాలు చేశారు. సామూహిక భజన కార్యక్రమాలు నిర్వహించారు. దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అహోబిలేశుడికి..

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవ పల్లకీ శనివారం ఆళ్లగడ్డకు చేరుకుంది. దీంతో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామం నుంచి బయలు దేరిన ఉత్సవ పల్లకికీ గ్రామ ప్రజలు మేళతాళాలతో స్వాగతం పలికారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న తెలుపు వద్ద ఉత్సవ పల్లకీ విడిది చేయడంతో డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐలు వెంకటరెడ్డి, నగీనా, కమిషనర్ రమేష్‌బాబు పూజలు చేశారు.

లక్ష్మీనరసింహ స్వామికి..

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలో స్వయంభువుగా వెలసిన సర్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు వేకువజామున అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.